# ధర్మవాహిని





భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

# 2

# ఆత్మధర్మము సమస్త ధర్మములకు ఆధారము

**ధర్మజ్యోతి స్వతంత్రమైనది :**

ధర్మమనునది ఒక హద్దునకు కట్టుబడినదికాదు, ఒక సమాజమునకు కానీ ఒక జాతికి కానీ సంబంధించినదికాదు; సమస్త ప్రాణికోటికి సంబంధించినది. అది యేమిచేసినను ఆరని అఖండ జ్యోతి. ధర్మజ్యోతి స్వతంత్రమైనది. మానవుడైన అర్జునుని నిమిత్తముగా నిలిపి, కృష్ణుడు గీతను బోధించెను. ఆ గీత నేడు సమస్త జీవులకూ సంబంధించినదై యున్నది. ఆ పవిత్ర గీత ఒక్క జాతికనియు, ఒక్క మతమునకనియు, ఒక వర్ణమునకనియు నియమింపబడలేదు. మానవజాతికే ఆ మహోపదేశము ప్రాణ సమానమైయున్నది.

ధర్మమనునది అనేక రూపముల ధరణిని తిరుగుచున్నది. మనుధర్మము, వర్ణధర్మము, గృహస్థధర్మము, వానప్రస్థ ధర్మము, సన్యాసధర్మము, బ్రహ్మచర్యధర్మము అని అనేక రీతులుగా ఆచరించుచున్నారు. అయితే అవి ఆచారధర్మములు మాత్రమే కానీ, నే తెలుపునది అంతరార్థధర్మము, ఆత్మధర్మము.

పై ఆచారధర్మములు దేహధర్మములు, ప్రకృతిధర్మములు. అయితే, అట్టి ధర్మములను ఆచరించు దేహమే స్థిరము కాదు. ప్రకృతియే సత్యముకాదు. ఇక ఆ ధర్మములు స్థిరమా? వాని సారము సత్యమా? అస్థిరమున, స్థిరమెట్లు చిక్కును? అసత్యమున

సత్యమెట్లు కనుపించును? స్థిరమునందే స్థిరము, సత్యమునందే సత్యము లభించును కానీ, అంధకారమున ప్రకాశము చిక్కిన, అంధకార మెక్కడుండును?

**రాయిని దేవునిగా తలంచటము నిజమైన ధర్మము :**

అట్లే ప్రకృతి సంబంధమయిన ప్రవర్తనములలోని ధర్మము మానవునకు ప్రధానమయినను, దానిని ఆత్మార్థసంబంధమయిన ధర్మముతో చేర్చి అనుసరించిన, అంతర్ బహిర్ దృష్టిలో ఒకే ఆత్మధర్మమును అనుభవించవచ్చును కదా! యథార్థధర్మమును మరుగుపరచక, ఆచారధర్మముతో ఐక్యపరచిన, ఆత్మధర్మమును అవలీలగా ఆచరింపవచ్చును. దేవుణ్ణి రాయిచేయటమే యిప్పటి దృష్టిలోనున్న ఆచారము; కానీ, అది సత్యమెట్లగును? రాయిని దేవునిగా తలంచటము నిజమైన ధర్మము. ఎట్లన, దేవుని సాకార రూపముపై లక్ష్యమును లగ్నపరచి, ఆ రూపమును రాతిలో నిర్మించిన రాయి మరుగై దేవుడు సాక్షాత్కరించును కదా? అట్లే యథార్థ ఆత్మధర్మమును లక్ష్యమునందుంచుకొని, ప్రకృతి సంబంధమయిన ఆచార ధర్మకర్మలను ఆచరించిన, అంతరార్థము మారదు కదా? ఆత్మధర్మము ఆరదు కదా?

అట్టి స్వతంత్రమయిన, సర్వవ్యాపకమయిన, సర్వ భూతాంతరాత్మకము అయిన సర్వేశ్వరుని సాకార రూపమును ఒక ఆకారమున ఎట్లు దర్శించగలుగుచున్నామో, అట్లే సర్వవ్యాపకమయిన, సర్వజన సమానమయిన, స్వాతంత్ర్య

స్వరూపమయిన ధర్మమును, మనమాచరించు భౌతికమయిన కార్యములందు దర్శించుచు ఆచరించుట ఎందుకు సాధ్యముకాదు? సాధ్యము కానటువంటి నిరర్థకకార్యము లెన్నియో సల్పి అశాంతి ననుభవించుట లేదా? సార్థకమయిన ధర్మము నాచరించి శాంతిని పొందుట సాధ్యముకాదా?

**విషయేంద్రియ కింకరత్వమే అసలైన బానిసత్వము :**

స్వతంత్రుడగుట నీ జన్మహక్కు కానీ, అస్వతంత్రుడగుట కాదు. స్వతంత్రరూపమయిన ధర్మమును ఆచరించినపుడే నీవు స్వతంత్రుడవు కానీ లేకున్న అస్వతంత్రుడవే. ధర్మము స్వతంత్ర స్వరూపమన్న, కొంతమంది శంకింతురు. ఇప్పుడు లోకమనుకొను దృష్టిలో మాత్రం నీవు స్వతంత్రుడవుకావు. స్వాతంత్ర్యరూపము సరిగా తెలియకయే ఒక రకమయిన బానిసత్వమునకు స్వాతంత్ర్యమనియు వేరొక రకమయిన బానిసత్వమునకు అస్వాతంత్ర్యమనియు పేర్లు పెట్టి పిలుచుచున్నారు. నిజమయిన స్వాతంత్ర్యము దేహభ్రాంతి రహితమయిన ఆత్మ ధర్మమే.

ఈ సత్యదృష్టిలో బానిసత్వమునుండి తప్పించుకొన్నవారు బానిసతనము రూపములో తేడా తప్ప, దేహదృష్టితో దేహ తాదాత్మ్యంతో చేసే పని అంతా యేదో ఒక రకమయిన బానిసతనమే! దేహభ్రాంతే, విషయేంద్రియ కింకరత్వమే అసలైన బానిసత్వము! దీనిని తప్పించుకొనగలవాడే నిజమయిన స్వతంత్రుడు. అదే నిజమయిన ధర్మము. అట్టి ధర్మమును

దృష్టియందుంచుకొని సంచరించువాడే ముక్తపురుషుడు. ముక్తపురుషులు కాగోరు వారెల్లరు పైధర్మమును పొందవలెను.

ఇట్టి ధర్మమును పొందకుండుటకు మూలము తననుతాను బానిసగా చేసికోవటమే. తననుతాను బంధించుకోనిదే ఎవరూ తనను బంధించలేరు. సర్వభూతాంతరాత్మయగు పరమాత్ముడు సర్వులయందు సమానస్వరూపుడుగా నుండునను విశ్వాసము దృఢముగానున్న, అది తనలోనున్న పరమాత్ముడు బానిస కాడను నిశ్చితజ్ఞానమును నిరూపించును. ఆత్మధర్మము అతిదూర మగుటవల్లనే అట్టి దృఢవిశ్వాసము వారియందు ఆవేశించదు. అట్టి విశ్వాసము ఆవేశింపనిదే నిశ్చితజ్ఞానము ప్రకాశింపదు. నిశ్చితజ్ఞానమెపుడు కలుగదో వాడపుడు అంధుడై, అస్వతంత్రుడై, అవస్థలకు, అనర్థములకు గురియగును. అట్టి వానిని ధర్మ దేవత వరింపదు.

**సత్యధర్మములు, ఆచారధర్మములు అవినాభావ సంబంధమైనవి :**

కాన, మొదట స్వతంత్రుడు కావటానికి ప్రయత్నించవలెను. దానికి మునుపు, అమిత విశ్వాసము కుదురవలెను. తదుపరి ఆ సత్యధర్మమునే ప్రకృతి ఆచారధర్మములపై నిరూపించి ఆచరించిన, అట్టి వానిని ధర్మపురుషుడనియు, ధర్మాచరణ కలవాడనియు తలంచవచ్చునే కాని, కేవలము దేహసంబంధమైన అనిత్య ధర్మములను సత్యధర్మములుగా పాటించిన సార్థకము కాదు. రాళ్ళను దేవుళ్ళుగా భావించిన యెంత పవిత్రమో, భౌతిక

ధర్మకర్మలయందు సత్యధర్మములను దర్శించిన అంత పవిత్రము. దేవుళ్ళనుకూడ రాళ్ళవలె భావించి నమస్కరించిన యెంత ఫలమో, సత్యధర్మములను వదలి కేవలము భౌతికధర్మములను ఆచరించిన అంతే ఫలము. సత్య ధర్మములు లేక ఆచారధర్మములు, ఆచార ధర్మములు లేక సత్యధర్మములు నిస్సారము. ఈ రెండును అవినాభావ సంబంధముగా ఆచరించవలెను.

పై ఉద్యోగికి చిన్న ఉద్యోగియొక్క పనితో ఎట్లు అవసరమో, చిన్న ఉద్యోగికి పెద్ద ఉద్యోగియొక్క ధనసహాయముతో అట్లు అవసరము. ఇపుడు ఎవరు ఎవరికి బానిసలు? ఎవరి వాంఛలకు వారే బానిసలు. బాహ్యదాస్యభావము, అసలు సూత్రము గుర్తించనంతవరకు ఎవరికీ తప్పదు. ఆత్మసూత్రం గుర్తిస్తే దాస్యభావం తొలగుతుంది. ప్రకృతి ధర్మము పరమాత్మ ధర్మంతో చేరుతుంది. వేదాంతము, ఆధ్యాత్మిక శాస్త్రము మానవుని బానిసగా కాక, భగవంతునిగా పనిచేయమంటుంది. అపుడు కర్మ, కామ్యకర్మగాకాక ధర్మకర్మగా మారుతుంది. కేవలము పనులు మార్చుకొనుటచేత దాస్య శృంఖలాలు ఎవరికీ తప్పవు. విపర్యయ దృష్టిని మార్చుకోవటంచేత, దేహదృష్టిని దేవునిపై త్రిప్పు కోవటముచేత బానిసతనం తప్పుతుంది; ధర్మగుణము హెచ్చుతుంది. ఒకరు ఉద్యోగము చేయటము బానిసత్వమనియు, ఇంటిలో కూర్చొనటము స్వతంత్రమనియు తలంతురు. ఇవి తెలివితక్కువ మాటలు, ఊహలు.

**ధర్మములు అహంకార, బంధ విముక్తికి దారితీసేవిగా ఉండవలెను :**

ఉద్యోగములో నున్నప్పుడు పై ఉద్యోగికి విహితంగా నడవవలెను కదా? ఇంట్లోనూ బంధుహితవర్తనం తప్పదు కదా? పోనీ మిత్రులకడకు పోయిన, వారికి కూడా అనుకూలంగా నడవటం తప్పుతుందా? చివరకు తనకు తాను అనుకూలంగా నడచుకోక తప్పుతుందా? ఇక దాస్యబంధపు బాహుపంజరమునుండి విడిపోగల అవకాశమెక్కడ? బాహ్యరూపవిధానాలలో భేదమే కానీ శారీరక దృష్టితోకూడిన జీవితమంతా బానిసతనమే.

అందుకనే ఒక సమయములో శంకరుడు నరకమంటే దేహాభిమానమే అన్నాడు. దేహాభిమానమే దైవ విముఖత్వముయొక్క వేరొకరూపం. భూమిమీద ముండ్లు, రాళ్ళు అసలు లేకుండా ఎవరు చేయగలరు? చేయలేరు. చెప్పులు వేసికొని వానిబాధనుండి తప్పించుకొన ప్రయత్నించవలెనే కానీ వేరు మార్గముండదు. వేదాంత దర్శనము, సత్యదృష్టిచేత స్వస్వరూప బ్రహ్మదృష్టిచేత, సత్య స్వాతంత్ర్య ధర్మమును పొందవచ్చునని తెలుపుచున్నది. బాహ్యపరివర్తనాలు తాత్కాలికోపశమనోపాయాలు మాత్రమే. సర్వవిధ దాస్యములకూ సంబంధించిన దేహమునకు నేను బానిసను కాను; ఈ దేహము నా బానిస, నేను సర్వనియంతను, ముక్తిస్వరూపుడను అనే నిత్య, సత్ భావనలతో ఎవడు అహంభావాన్ని కాల రాస్తాడో, అతడే విముక్తుడు. ధర్మములు

అహంకార బంధ విముక్తికి దారి తీసేవిగా నుండవలెను. ధర్మము అహంకార, వికార ప్రేరితము కాకూడదు. ఇదే సూత్రము. ఇదే స్వాతంత్ర్యము.

**పరమాత్మతో సంయోగానుభూతి పొందటమే నిజమైన ధర్మము :**

ఒకడు కొడుకుదగ్గర సుఖము లేదని కూతురు దగ్గరికి పోతాడనుకోండి. ఇది స్వాతంత్ర్య ప్రాప్తికి మార్గము కాదు. ఇవి అహంకారమునకు చేసే రకరకపు ఉపచారములు మాత్రమే. ఇంద్రియ సుఖములకని ఇల్లు వీడుట ధర్మము కాదు. ఈశ్వర సుఖమునకు, ఈశ్వరానందమునకు, ఈశ్వర చింతనకు ఇల్లు కానీ మరేమైనాసరే విడువవచ్చును. విముక్తిస్వరూపుడైన పరమాత్మతో సంయోగానుభూతి పొందటమే నిజమైన ధర్మము, నిజమైన విముక్తి. అట్టివానిని చెఱసాలలు సహితము బంధింపలేవు. దేహానికి బానిసలైనవారిని ఎండిన పోచకూడా కాలపాశమై బంధిస్తుంది.

ఆత్మనిమగ్నత, అంతర్ముఖీనత, స్వస్వరూపనిష్ఠ, బ్రహ్మజ్ఞానము ఈ నాలుగు నిజమైన ధర్మములు. స్వాతంత్ర్యమును ప్రసాదించునవి ఇవియే. ఈ భౌతిక దేహాచరణలయందు వేరు పేర్లు పెట్టబడి, అంతర్ ధర్మమును వీనియందిమిడ్చి ఆచరించుటకై సత్యము, శాంతము, ప్రేమ, అహింస అను నాలుగు రూపములు ధరించి చరించుచున్నవి. ప్రతి కార్యమందు, ప్రతి తలంపునందు ప్రతి విషయమునందు ఈ నాలుగు మహాసిద్ధాంతములను పాటించుటే ఇప్పటి, అప్పటి ధర్మమునకు సూత్రమగును. నేటి సత్య, ప్రేమ,

శాంతి, అహింసలే ఆనాటి ఆత్మ నిమగ్నత, అంతర్ముఖీనత, స్వస్వరూప నిష్ఠ, బ్రహ్మ జ్ఞానము. రెండింటియందూ ధర్మము ఒక్కటిగనే యేక రూపమును పొందవలెను. అట్లుండిన అది ఆత్మధర్మమనబడును. పై ప్రవర్తనలను పాటించదు; రూపనామముల యోచించదు; చేతికి వేసిన సంకెళ్ళు ఇనుపవైన నేమి? బంగారువైన నేమి? చేతులను బంధించినవి కదా? అట్లే రూపనామములు ఏవైననేమి? ఆత్మతత్త్వమును, ఆత్మ ధర్మమును ఆచరించే యే కార్యక్రమమైనా, నిజమైన ధర్మమే అగును. ఇదే శాంతి సిద్ధిని కలిగించును.

అట్లుగాక అహంకార సముద్ర తరంగములు మానవులను ఇంట్లోకి గుంజినా, అరణ్యమునకు నెట్టినా, యెక్కడకు నెట్టినా బాధ అనుభవింపక తప్పదు కదా? పండుకొన్నంత మాత్రమున, పడగ విప్పకుండినంత మాత్రమున; పాము, పాము కాకుండునా? ఎట్లుండినా పాము, పామే. ప్రకృతి ఆచరణలలో ఆత్మతత్త్వమును, సత్యధర్మమును ఇమిడ్చి ఆచరించినంతమాత్రమున ధర్మము మారునా? మారదు. ఎక్కడ ఉన్ననూ ధర్మము ధర్మమే. అట్లుగాక కృత్రిమ స్వాతంత్ర్యములు, కృత్రిమ ధర్మములు (అనగా వారి వారి అనుకూలతనుబట్టి నియమించిన క్రమ శిక్షణలు) సత్యధర్మములని చాటిన అవి సత్యధర్మములు కానేరవు; బానిసతనముయొక్క సంచలనావస్థలే. జైలులోపడ్డవానిని రక్షక భటులు వెంట నుండి, ఇటు అటు కదలనివ్వక, కోర్టుకో లేక కూటికో తీసికొనిపోయే పద్ధతివంటివే ఈ కృత్రిమ ధర్మములు.

**హరిరతిచేత జగద్రతి నశించును :**

ఇంతెందుకు; హితుడు, అహితుడు అనుకోవటముకూడా పొరపాటే. ఈ భ్రాంతి త్యాజ్యం. ప్రేమ స్వరూపుడైన పరమేశ్వరుడే నిత్యబాంధవుడు, నిత్యసంభావ్యుడు, నిత్యాశ్రయుడు, నిత్యపోషకుడు, నిత్యహితుడు. దీనిని గ్రహించి అనుభవించటము జ్ఞానమయ, ధర్మమయ జీవనము. ఈ మూలసూత్రములను విడచి బైటి మార్పులమీద ఎక్కువ ఆధారపడటంవలన లక్ష్యము సిద్ధించుట లేదు. హరిరతిచేత జగద్రతి నశించును. పై ఆకాశము చూస్తూ భూమి కనుపించలేదన్నచో, ఎట్లు కనుపించును? భూమిపై చూస్తూకూడా ఆ భూమిపై, పై ఆకాశ ప్రతిబింబ రూపమును తెలిపించు జలమును ఆధారముగ తీసికొన్న లోని భూమి, పై ఆకాశము రెండునూ కనుపించును.

అట్లే, ఆత్మతత్త్వమైన సత్యధర్మములవెంట మానవులు నడచుకొనవలెనన్న, ప్రకృతిపై ఆచరించు కర్మలయందు, సత్యధర్మముల ప్రతిబింబమును నిరూపించునట్టి జ్ఞానమును ఆధారముగా తీసికొన్న, ఆత్మ ధర్మమును, భౌతిక ధర్మమును, అనగా హరిరతిని జగద్రతిని, రెండింటిని అనుభవించవచ్చును. అయితే లక్ష్యాన్ని మార్చకూడదు. అనగా భావాన్ని, సారాన్ని మార్చకూడదు. రూప నామములు మారినను మారవచ్చును. ధర్మమునకు రూప నామములు ప్రధానము కావు, భావరాగములే దాని ప్రయోజనములు.

